సాక్షి కామారెడ్డి
సోమవారం, 21, జూలై, 2025



ఘనంగా బోనాల పండుగ

జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. అమ్మ వారికి బోనాలు సమర్పించారు.

- 8లో ▸



రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

జీర్కూర్ – దుర్కి రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.1/23.3

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

అందరు ఉన్న అనాథ!

- కామారెడ్డి నియోజకవర్గాన్ని పట్టించుకోని నేతలు
- సమస్యలను గాలికి వదిలేసిన అధికార, ప్రతిపక్షాలు
- ఆధిపత్యం కోసమే ఆరాటం.. నిధులు సాధించడంలో విఫలం
- ఇబ్బందిపడుతున్న ప్రజలు

కామారెడ్డి నియోజకవర్గంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేతలున్నారు. రెండుసార్లు మంత్రిగా పనిచేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన ప్రధాన ప్రతిపక్ష నేత గంప గోవర్ధన్.. ఒకే ఎన్నికలో ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థులను ఓడించి జెయింట్ కిల్లర్‌గా నిలిచిన వెంకటరమణారెడ్డి వంటి వారున్నారు. అయినా అభివృద్ధిలో కామారెడ్డి వెనకబడిపోతోంది. నేతలు ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తూ సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ రోడ్‌లో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి నియోజకవర్గం గత అసెంబ్లీ ఎన్నికల్లో హాట్ సీట్‌గా మారింది. ఇక్కడినుంచి బీఆర్‌ఎస్ అధినేత, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ బరిలో దిగడం, ఆయనపై ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోటీ చేయడం.. ఓటర్లు ఇరువురిని కాదని స్థానిక నేత, బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డిని గెలిపించడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో ఆ పార్టీ సైలెంట్ అయిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇరు పార్టీల నేతల మధ్య ఆధిపత్య పోరుతో నియోజకవర్గం అభివృద్ధిలో వెనకబడిపోతోంది. సమస్యలపై నిలదీయాల్సిన ప్రధాన ప్రతిపక్షం కూడా పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే వెక్కిరిస్తున్నాయి.

22వ ప్యాకేజీకి నిధులేవీ..

కామారెడ్డి నియోజకవర్గంతో పాటు ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని పలు మండలాల పరిధిలో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందించే



టీచర్స్ కాలనీలో ఏడాది క్రితం డ్రెయినేజీ కూలి ప్రమాదకరంగా మారిన రోడ్డు

కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులు ముందుకు సాగడం లేదు. భూసేకరణకు దాదాపు రూ. 2 వందల కోట్లు అవసరం. ఇటీవల పనుల కోసం రూ. 23 కోట్లు మంజూరయ్యాయి. అవి ఏ మూలకూ సరిపోవు. అత్తెసరు నిధులతో భూసేకరణే పూర్తి కాదు, పనులెలా చేస్తారో పాలకులకే తెలియాలి.

సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో ఓడిపోయినా.. 54,916 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో కీలకమైన సాగునీటి సమస్య పరిష్కారంపై సీఎం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వానాకాలంలోనూ తాగునీటి సమస్య..

జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కామారెడ్డి పట్టణంలోని చాలా ప్రాంతాలకు మిషన్ భగీరథ నీరు మూడునాలుగు రోజులకోసారి వస్తున్నాయి. ఎండాకాలంలోనే కాదు.. ఇప్పటికీ చాలా ప్రాంతాలలో ప్రజలు ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఉంది. వర్షాలు లేకపోవడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. మిషన్ భగీరథ నీటి సరఫరాలోనూ ఇబ్బందులున్నాయి.

విద్యారంగంపై నిర్లక్ష్యం..

నాలుగైదు జిల్లాలకు కూడలి అయిన కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆయా పార్టీల నేతలు హామీ ఇచ్చినా అడుగులు ముందుకు పడడం లేదు. ఇతర జిల్లాలకు జేఎన్‌టీయూ, ఇంజినీరింగ్ కాలేజీలు వస్తున్నా కామారెడ్డికి మాత్రం మంజూరు కావడం లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టింది. జిల్లాలో మూడు నియోజకవర్గాలకు ఈ స్కూళ్ల మంజూరైనా కామారెడ్డికి మాత్రం రాలేదు. వైద్య కళాశాల ఏర్పాటైనా ఆస్పత్రిలో సరైన సేవలందడం లేదు. ప్రమాదాల్లో గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్, హైదరాబాద్‌లకు రెఫర్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ మెడికల్ కాలేజీ ఉండి, ప్రొఫెసర్లు, డాక్టర్లున్నా లాభం లేకుండాపోతోంది. ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగపడేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

అధ్వానంగా రోడ్లు..

కామారెడ్డి పట్టణంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చిరు జల్లులకే ప్రధాన రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. నాలాలు కబ్జాలకు గురవడంతో వర్షపు నీరు వెళ్లే దారిలేక రోడ్లపై పారుతోంది. నిజాంసాగర్ రోడ్డు, అశోక్‌నగర్ రోడ్డు, స్టేషన్‌రోడ్డు, సిరిసిల్ల రోడ్డు, విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రదాన రోడ్లపైనే వరద నీరు నిలుస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల వరద ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. పట్టణంలో కూడళ్లను జంక్షన్లుగా అభివృద్ధి చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లను విస్తరించాల్సి ఉన్నా ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అప్పట్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విస్తరణ కోసం తన ఇంటిని కూల్చివేయించుకున్నారు. మార్కింగ్ చేసినా రోడ్ల విస్తరణకు అడుగులు పడడం లేదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు చలానాలు రాయడం, వసూళ్లు చేయడంలోనే నిమగ్నమయ్యారు. దీంతో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



కాళేశ్వరం ప్యాకేజీ 22లో భాగంగా తవ్వి వదిలేసిన కాలువ

రాజకీయాలు పక్కన పెడితేనే..

పదవుల్లో ఉన్న వారు ఎవరి స్థాయిలో వారు ప్రయత్నిస్తేనే అభివృద్ధికి నిధులు తీసుకురాగలుగుతారు. తమ ప్రభుత్వం లేదు అని ఒకరు, తాను పదవిలో లేనని మరొకరు, తాను పదవిలో లేను తమ ప్రభుత్వమూ లేదని ఇంకొకరు పట్టించుకోకుంటే అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే వెనుకబడిపోయామనే భావన కామారెడ్డి జనంలో కలుగుతోంది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో పాటు నియోజక వర్గ ప్రజలు ఓట్లేసి ఎమ్మెల్యేగా గెలిపించిన వెంకటరమణారెడ్డి చొరవ తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సాధించాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

26న ట్రయథ్లాన్ ఎంపిక పోటీలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 26న జిల్లాస్థాయి ట్రయథ్లాన్ పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి అండర్–14, 16, 18, 20, సీనియర్స్ మెన్, ఉమెన్ ట్రయథ్లాన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో పాఠశాల నుంచి ఒక అంశంలో ఇద్దరు క్రీడాకారులకు మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ట్రయథ్లాన్ ఏ, బీ, సీ గ్రూప్‌లుగా 60, 100, 400, 600, 800, 1,500 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్, జావెలిన్ త్రో అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు.

జోరుగా వరినాట్లు



బీబీపేట: మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరినాట్లు జోరుగా సాగుతున్నాయి.

విహార యాత్రకు ఆర్టీసీ బస్సు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఈనెల 27న విహార యాత్రకు బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ సరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్ నుంచి 27న మధ్యాహ్నం 3 గంటలకు బస్సు బయలు దేరుతుందని పేర్కొన్నారు. కాణిపాకం, అరుణాచలం గిరి ప్రదక్షిణ, గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బాన్సువాడ చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ. 5,100, పిల్లలకు రూ. 2,600 ఉంటుందని పేర్కొన్నారు. సీట్లు బుక్ చేసుకోవాలనుకునేవారు 90634 08477 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు దాశరథి శతజయంత్యుత్సవాలు

నిజామాబాద్ రూరల్: మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలను నిజామాబాద్ నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు దాశరథి కృష్ణమాచార్య జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని కవులు, కళాకారులు విజయవంతం చేయాలని కోరారు.

భూమి దక్కదేమోనని రైతు ఆత్మహత్య

- అప్పులు, భూ వివాదాలే కారణమని సూసైడ్ నోట్
- శాబ్దిపూర్‌లో ఘటన



కృష్ణారెడ్డి (ఫైల్)

కామారెడ్డి టౌన్: అప్పుల బాధతోపాటు భూమి కబ్జాకు గురైందన్న ఆవేదనతో ఓ రైతు సూసైడ్ నోట్ రాసి బలవన్మరణానికి పాల్పడ్డాడు. శాబ్దిపూర్‌లో శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేకులపల్లి కృష్ణారెడ్డి(56)కి 26 గుంటల భూమి ఉంది. ఈ భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు కబ్జా చేశారు. సర్వే అధికారులు వచ్చి ఆ భూమి ముగ్గురి కబ్జాలో ఉందని తేల్చారు. ఈ విషయంలో న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ఓవైపు అప్పుల బాధలు.. మరోవైపు కబ్జాకు గురైన తన భూమి దక్కుతుందో లేదోనన్న ఆందోళనతో మానసికంగా కుంగిపోయాడు. శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

సూసైడ్ నోట్..

రైతు కృష్ణారెడ్డి సూసైడ్ నోట్ రాశాడు. ఐదేళ్ల క్రితం రూ. 80 వేలు అప్పు తీసుకున్నానని, అది వడ్డీతో కలిపి రెట్టింపు అయ్యిందని తెలిపాడు. బాకీలు కట్టలేని పరిస్థితిలో ఉన్నానని, ఉన్న భూమి అమ్మి అప్పులు కడుదామంటే ముగ్గురు వ్యక్తులు(వారి పేర్లు రాశాడు) అమ్మనివ్వకుండా పోలీస్ స్టేషన్‌లో, కోర్టులో కేసు పెట్టారని పేర్కొన్నాడు. ఎస్పై, ఎస్పీ, తహసీల్దార్ దయతలచి తన కుటుంబానికి భూమి ఇప్పించాలని కోరాడు. భూమి గురించి భార్యతో రోజూ లొల్లి అవుతోందని, బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. తనను క్షమించాలని భార్య లక్ష్మిని సూసైడ్ నోట్‌లో కోరాడు.

చదువులపై కలెక్టర్ ఫోకస్!

- వంద శాతం విద్యార్థుల హాజరుకు చర్యలు
- ఎస్సెస్సీలో అగ్రస్థానమే లక్ష్యంగా అడుగులు



జిల్లా కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో విద్యార్థి పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎస్సెస్సీ ఫలితాలలో నానాటికీ పడిపోతున్న జిల్లా స్థానాన్ని మెరుగుపరిచేందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చర్యలు చేపట్టారు. పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు గతేడాది 19వ స్థానంలో నిలవగా.. ఈ ఏడాది 20వ స్థానానికి పడిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యార్థులలో సామర్థ్యాలను పెంచేందుకు, ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరిచేందుకు కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలపై ఫోకస్ చేశారు.

ఉపాధ్యాయులదే బాధ్యత

విద్యార్థులు నూరు శాతం హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేస్తున్నారు. ఆయన సందర్శించిన ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశాల్లోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. విద్యార్థుల హాజరు నమోదు చేసే ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేషియల్ రికగ్నిజేషన్ అటెండెన్స్ సిస్టమ్) యాప్‌లో వంద శాతం నమోదు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గైర్హాజరయ్యే విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడాలని సూచించారు.

పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రంలో నంబర్ వన్ స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరుకావడంతో పాటు అన్ని సబ్జెక్టుల్లో ప్రావీణ్యం సాధించేలా వారిని తీర్చిదిద్దాలని సూచించారు. విద్యాప్రమాణాల పెంపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన టీచర్లకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటి నుంచే కార్యాచరణ అమలు చేస్తే ఉత్తీర్ణతలో ముందుండడానికి అవకాశాలు ఉంటాయన్నది ఆయన ఉద్దేశంగా కనిపిస్తోంది.

విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తూ..

విద్యాసంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి కలెక్టర్ నిత్యం ఏదో ఒక పాఠశాలను సందర్శిస్తున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా స్కూళ్లను కచ్చితంగా విజిట్ చేస్తున్నారు. విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రశ్నలు వేస్తూ వారి చదువును అంచనా వేస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా టీచర్ అవతారం ఎత్తుతున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరైనపుడే చదువులో రాణిస్తారని ఆయన సూచిస్తున్నారు. అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులు పూర్తి పట్టు సాధించేలా వారిని తీర్చిదిద్దాలని ఆదేశిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ సాయంతో నిర్వహించే డిజిటల్ ఏఎక్స్‌ఎల్ ప్రోగ్రాంలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా చూడాలని సూచిస్తున్నారు. కలెక్టర్ క్రమం తప్పకుండా స్కూళ్లను విజిట్ చేస్తుండడంతో టీచర్లు అప్రమత్తమయ్యారు. బడులకు ఎగనామం పెట్టేవారు, స్కూళ్లకు వెళ్లినా ఫోన్‌లతో కాలక్షేపం చేసేవారిలో కొంత వణుకు మొదలైనట్లు తెలుస్తోంది.

ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు వార్నింగ్..

ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాఠశాలలను తరచూ తనిఖీ చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేస్తున్నారు. తరచూ పాఠశాలలను తనిఖీ చేయనివారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఈవోను ఆదేశించారు. విద్యాప్రమాణాల పెంపే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేస్తున్నారు.

స్కానింగ్ సేవలు అందేదెప్పుడో?

జిల్లాకేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ ఉన్నా.. రోగులకు సరైన సేవలు అందడం లేదు. ప్రధానంగా సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ స్కానింగ్‌ల కోసం ప్రైవేట్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రైవేట్ సెంటర్లలో వేలాది రూపాయలు వసూలు చేస్తుండడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు.

- దోమకొండకు చెందిన నవీన్ రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు.. సీటీ స్కానింగ్ చేయించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో రూ. 14 వేలు అప్పు చేసి ప్రైవేట్‌లో చేయించారు.
- పట్టణంలోని స్నేహపూరి కాలనీకి చెందిన బాలరాజు ఇటీవల బైక్‌పై వెళ్తుండగా తాడ్వాయి వద్ద వెనకాల నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. జీజీహెచ్‌కు తీసుకెళ్లగా వైద్యులు సీటీ స్కానింగ్ చేయాలని సూచించారు. బాల్‌రాజు కొడుకు వద్ద రూ. 3వేలు మాత్రమే ఉండడంతో రూ. 11 వేలు అప్పు చేసి ప్రైవేట్‌లో స్కానింగ్ చేయించాడు.
- పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో నివసించే ఆటో డ్రైవర్ రమేశ్ 15 రోజుల క్రితం నడుం నొప్పితో జీజీహెచ్‌కి వెళ్లగా.. వైద్యులు పరీక్షించి ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ సేవలు లేకపోవడంతో ప్రైవేట్ సెంటర్‌కు వెళ్లారు. రూ. 8వేలు అవుతాయని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు చెప్పడంతో కుటుంబ సభ్యులు మూడు గ్రాముల బంగారాన్ని ఓ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి మరుసటి రోజు స్కానింగ్ చేయించారు.



దయాగ్నోస్టిక్ హబ్‌లో ఖాళీగా ఉన్న సీటీ స్కానింగ్ గది

- జీజీహెచ్‌లో సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ సేవలు కరువు
- ప్రైవేట్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి..
- జిల్లా కేంద్రంలో అందుబాటులోకి తేవాలని ప్రజల డిమాండ్



కామారెడ్డి జీజీహెచ్ భవనం

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలో మూడేళ్ల క్రితం 330 పడకలతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. బాన్సువాడలో ఏరియా ఆస్పత్రి ఉంది. జిల్లాలో ఏడు సీహెచ్‌సీలున్నాయి. ఐదు జిల్లాల కూడలి అయిన కామారెడ్డి జిల్లా మీదుగా పలు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలూ ఎక్కువగానే జరుగుతున్నాయి. ప్రమాదాలల్లో ప్రతినెలా 250 మందికి పైగా క్షతగ్రాతులవుతున్నారు. వీరిలో పలువురికి సీటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్‌లు అవసరం అవుతున్నాయి. అలాగే ఇతర సమస్యలతోనూ ఆయా స్కానింగ్‌లు అవసరం. అయితే జిల్లాకేంద్ర ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలో మూడు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లున్నాయి. ప్రతినెలా ఒక్కో సెంటర్‌లలో 200లకు పైగా సీటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్‌లు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్కానింగ్‌ను బట్టి రూ. 6 వేల నుంచి రూ. 25 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎంఆర్‌ఐ కూడా రూ. 3 వేల నుంచి రూ. 15 వేల వరకు వసూలు చేస్తుండడం గమనార్హం.

టీ హబ్‌లో..

జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల పక్కన రెండేళ్ల క్రితం తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్ట్రిక్ట్ హబ్ ప్రారంభించారు. అందులో సీటీ స్కానింగ్ గది కూడా ఉంది. అయితే స్కానింగ్ యంత్రం మాత్రం లేకపోవడంతో ఆ గది ఖాళీగానే ఉంటోంది. రెండు రోజుల క్రితం నిర్వహించిన జీజీహెచ్ హెచ్‌డీఎస్ సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి రాజన్న సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ సేవల గురించి ప్రస్తావించారు. ఆయా సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి పేదలపై భారాన్ని తగ్గించాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి, సర్కారు దవాఖానాలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సేవలు అందుబాటులోకి తేవాలి



జిల్లాలో మెడికల్ కళాశాల, జీజీహెచ్ ఉన్నా ఇప్పటివరకు సీటీ స్కానింగ్, ఎంఆర్‌ఐ ఉచిత సేవలు లేకపోవడం దారుణం. దీంతో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లకు వెళ్లాల్సి వస్తోంది. వేలాది రూపాయలు పెట్టి స్కానింగ్ చేయించడానికి పేదలు ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి జిల్లా ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులోకి తేవాలి.

– రాజన్న, జిల్లా కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ

ప్రభుత్వానికి నివేదిస్తాం

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సీటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ సేవలు లేవు. ఈ సమస్య జీజీహెచ్ ఆస్పత్రి పరిధిలోకి రాకున్నా.. ఈ విషయాన్ని డీఎంఈ దృష్టికి తీసుకెళ్తాం.

– పెరుగు వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్



పురి విప్పిన మయూరం

నెమలి పురివిప్పి నాట్యం చేస్తుంటే.. ఆ సోయగం కనువిందు చేస్తుంది. ఆదివారం మల్కాపూర్ శివారులో ప్రకృతి అందాల నడుమ ఓ మయూరం పురివిప్పి నాట్యం చేస్తుండగా 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– బీబీపేట

మల్కాపూర్ శివారులో పురివిప్పి నాట్యం చేస్తున్న మయూరం

క్లుప్తంగా

నల్లా నీటిలో జలగలు

నిజాంసాగర్(జుక్కల్): ఒడ్డేపల్లిలో నల్లా నీటిలో జలగలు వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కుళాయిల ద్వారా జలగలు రావడంతో నీటిని తాగేది ఎలా అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజులుగా జలగలు వస్తున్నాయని పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కుళాయి జలగలు రాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



బ్రాహ్మణపల్లి శివారులో వంగిన స్తంభం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని వివిధ గ్రామాలలో విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. విద్యుత్ తీగలు కొన్ని చోట్ల మనిషికి అందే ఎత్తులో ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులకు ఎన్ని సార్లు చెప్పినప్పటికి పట్టించుకోవడం ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వేలాడే వైర్ల క్రింద పంటలు ఎలా వేసుకోవాలో అర్థం కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐడియా అదిరెన్..!



చుక్కాపూర్‌లో కేజీవీల్ ట్రాక్టర్‌తో వరినారు తరలిస్తున్న రైతు

మాచారెడ్డి: వరినాట్లు వేసేటపుడు సాధారణంగా రైతులు నారును రెండు చేతుల్లో పట్టుకెళ్లి మడుల్లో వేస్తారు. దాంతో ఆలస్యం కావడమే కాకుండా రైతుకు శ్రమ అధికంగా అవుతుంది. దీంతో చుక్కాపూర్ గ్రామానికి చెందిన జీడిపల్లి రాంరెడ్డి అనే యువరైతు నాటు వేయడం కోసం ట్రాక్టర్ వెనుకబాగంలో చీరలు కట్టి చీరపై నారును వేసి మడులకు తరలిస్తున్న దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

సాహిత్యంలో వరలక్ష్మికి డాక్టరేట్



డొంకేశ్వర్(ఆర్మూర్): సాహిత్యంలో రాణిస్తున్న డొంకేశ్వర్ మండలం తొండాకూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ వరలక్ష్మికి డాక్టరేట్ లభించింది. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన జాతీయస్థాయి భారత్ విభూషణ్–2025 అవార్డుల ప్రదానోత్సవంలో డేస్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. డాక్టరేట్‌ను అందజేసి ప్రోత్సహించిన యూనివర్సిటీకి ఈ సందర్భంగా వరలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో బోనాల ఊరేగింపు



పంచముఖి హనుమాన్ కాలనీలో ..

అంగరంగ వైభవంగా బోనాలు

సాక్షి నెట్‌వర్క్:జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆషాఢ మాస బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. డీజే సౌండ్స్, డప్పు చప్పుల మధ్య నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపు సాగించారు. స్థానిక అమ్మవారి ఆలయాల్లో బోనాలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. బాన్సువాడ పట్టణంలో జరిగిన బోనాల మహోత్సవంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి పాల్గొన్నారు. పోతరాజు వేషధారణలు ఆకట్టుకున్నాయి.



కామారెడ్డి పట్టణంలో బోనాల ఊరేగింపులో మహిళలు



బాన్సువాడరూరల్: బోనాల మహోత్సవంలో పాల్గొన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజ్



పెద్దమల్లారెడ్డిలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో..



మద్నూర్‌లో..



లింగంపల్లి కలాన్‌లో ..



యాదారంలో..



కామారెడ్డి పట్టణంలో బోనమెత్తుకున్న యువతులు



లింగంపేట కేజీబీవీలో ..



దోమకొండలో పెరిక సంఘం ఆధ్వర్యంలో ..



రాంపూర్‌లో శివసత్తుల ప్రదర్శన



బోర్లంక్యాంపులో అద్భుత దృశ్యం

ఆకాశం..అరుణ శోభితం

బాన్సువాడ రూరల్: ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో ఆకాశం ఎర్రని రంగుతో కనువిందు చేసింది. బాన్సువాడ మండలం బోర్లంక్యాంపులో ఈచక్కటి దృశ్యం ఆవిష్కృతమైంది.

గంజాయి పట్టివేత

బోధన్ టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లి బైపాస్‌రోడ్‌లో ఆదివారం రాత్రి కార్తిక్ అనే యువకుడి నుంచి 19 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. బైపాస్ రోడ్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. యువకుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించగా రెంజల్ బేస్ ప్రాంతంలో ఉండే ఓ వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేశాడన్నారు. యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



దాసరి కిషన్

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీనగర్‌కు చెందిన దాసరికిషన్(60) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు రెండో టౌన్ ఎస్సై సయ్యద్ ముజాహిద్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శివాజీనగర్‌కు చెందిన దాసరి కిషన్ ఈనెల 18న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కిషన్ కుమారుడు బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాద పరిషత్ సభ్యులు



నిజామాబాద్ లీగల్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి నూనెపల్లి హరినాథ్ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా న్యాయవాద పరిషత్ సభ్యులు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా న్యాయవాదులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. యువ న్యాయవాదులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యం పెంచుకొని వృత్తిలో ముందుకు సాగాలని సూచించారు. న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్, ఉమ్మడి జిల్లా న్యాయవాదులు సంతోష్ శర్మ, భార్గవ్ భూపాల్, గంగరాజు, విఠల్ రావు, సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

హోరెత్తిన ఎల్లారెడ్డి పట్టణం



ఎల్లారెడ్డిలో బోనాలతో శోభాయాత్ర చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ముత్యాల పోచమ్మ అమ్మవారికి ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా మహిళలు ఘనంగా బోనాల పండగను నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, బీజేపీ నాయకులు మాజీ ఎంపీ బీబీ పాటిల్, పైడి ఎల్లారెడ్డి, బాణాల లక్ష్మారెడ్డిలు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. పండుగలో భాగంగా బోనాలతో మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. విజయవాడ ట్రూప్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అమ్మవార్ల వేషధారణతో డ్యాన్సులు చేశారు. హైదరాబాద్ యువతులు చేసిన డ్యాన్సులు అలరించాయి. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఎల్లారెడ్డి హోరెత్తింది.



పోతురాజులతో విన్యాసాలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



అమ్మవారి వేషధారణలో విజయవాడ ట్రూపు సభ్యులు



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్



పట్టు వస్త్రాల సమర్పణకు వచ్చిన బీజేపీ నేతలు బీబీ పాటిల్, పైడి ఎల్లారెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి



డ్యాన్సులు చేస్తున్న హైదరాబాద్ యువతులు

పటిష్ట బందోబస్తు ఏర్పాటు



భద్రతను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో బోనాల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. బందోబస్తును సీఐ రాజారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట ఎస్సైలు మహేష్, దీపక్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

రైల్వే సేవలు ఒకే యాప్‌లో..

మీకు తెలుసా?



ఖలీల్‌వాడి: గతంలో రైల్వేశాఖ ద్వారా అందిస్తున్న సేవల కోసం వివిధ యాప్‌లు అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు వాటిని తొలిగించి వాటి స్థానంలో రైల్ వన్ అనే యాప్‌ను రైల్వేశాఖ అందుబాటులోకి తెచ్చింది. జూలై 1 నుంచి ఈ యాప్ అమలులోకి వచ్చింది. ఈ యాప్‌లో రైలు టికెట్ రిజర్వేషన్ తోపాటు అన్ని రకాల టికెట్లను ఈ యాప్ ద్వారా పొందవచ్చు. రైళ్ల రాకపోకలకు సంబంధించిన వివరాలు, రైలు ఎక్కడున్నదనే అంశాలు స్పష్టంగా తెలుస్తుంది. రైలు సమయపాలన తోపాటు ఏ ఫ్లాట్ ఫారంపై ఆగుతుంది, కోచ్ ఎక్కడ, పీఎన్‌ఆర్ స్థితి, రైలెక్కడ ప్రయాణిస్తుందో.. రైలు రిజర్వేషన్ రద్దు లాంటి తదితర అంశాలు అన్నీ ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. రైలులో ప్రయాణం చేసేటప్పుడు అవసరమైతే ఫుడ్‌ను ఆర్డర్ చేసుకుంటే మనం ప్రయాణిస్తున్న స్థానానికి తీసుకొచ్చి ఇస్తారు. ఈ యాప్ గూగుల్ ప్లేస్టోర్ ద్వారా, ఐవోస్ యాపిల్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మెయిల్ ఐడీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని పాస్వర్డ్ పెట్టుకోవడం ద్వారా వినియోగించుకోవచ్చు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



లింగన్న పాడె మోస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్



లింగన్న(ఫైల్)

నిజామాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. గూపన్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగన్న అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సాయంత్రం నిర్వహించిన ఆయన అంత్యక్రియలకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్ హాజరై పాడె మోశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. లింగన్న అకాల మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే అన్నారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు విశేష కృషి చేశారని ఎమ్మెల్యే అన్నారు. అంత్యక్రియల్లో పార్టీ జిల్లా నాయకులు బాగిర్తి బాగారెడ్డి, లింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టబోయే పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి కోరారు. సీఎం హైదరాబాద్‌లోని తన నివాసంలో సునీల్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జాబితా అందించారు. దీనికి స్పందించిన సీఎం నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు.

అదుపుతప్పి బోల్తాపడిన లారీ



పెద్దకొడప్‌గల్: మండలంలోని బేగంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై ఓ లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఆదివారం ఉదయం వేకువజామున హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న లారీ బేగంపూర్ చౌరస్తాలో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆర్మూర్‌టౌన్: యువత చెడు వ్యసనాలు వీడి మంచి మార్గంలో నడవాలని స్వేరోస్ చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్‌హాల్ ఉమ్మడి జిల్లా స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రపంచం మొత్తం కృత్రిమ మేధస్సు వైపు వెళుతున్న ఈ రోజుల్లో మనం కూడా వాటిని అందిపుచ్చుకొని గొప్పస్థాయికి రావాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్య పరిరక్షణపై చిట్కాలు, ఆత్మహత్య నివారణ, అక్షరం, ఆర్థికం, ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వేరోస్ చీఫ్ కన్వీనర్ బలుగురి దుర్గయ్య, వైస్ చైర్మన్ బాలప్రసాద్, స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి, దేవన్న, జైపాల్, లక్ష్మణ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇసుక టిప్పర్ల పట్టివేత



రుద్రూర్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పొతంగల్ శివారులో ఒక టిప్పర్, కోటగిరి మండలం వల్లాభాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద రెండు టిప్పర్లను పట్టుకొని కోటగిరి పీఎస్‌కు తరలించారు.

రుద్రూర్: పొతంగల్ మండలం హెగ్డోలి గ్రామ శివారులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం సాయంత్రం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను కోటగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

పొతంగల్ మండలం సోంపూర్ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక 15 ట్రాక్టర్ల వరకు ఉంటుందని తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలించిన, డంపు చేసిన కేసు నమోదు చేయడంతోపాటు వాహనాలు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

భిక్కనూరు: బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం భిక్కనూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాజేందర్‌బైక్‌పై భిక్కనూరు చౌరస్తా నుంచి గాంధీ బొమ్మ వైపునకు వెళ్తుండగా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వచ్చిన కారు ఢీకొన్నది. దీంతో రాజేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే కామారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని కలుషితం చేయొద్దు

డొంకేశ్వర్: పచ్చికబయళ్లతో ఆహ్లాదాన్ని పంచుతున్న ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలతో కలుషితం చేయొద్దని ఎన్విరాన్‌మెంట్ అండ్ వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధులు పర్యాటకులను కోరారు. ఆదివారం నవ్యభారతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులతో కలిసి డొంకేశ్వర్ మండలం చిన్నయానం బ్యాక్ వాటర్ వద్ద పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బ్యాక్ వాటర్ ప్రాంతానికి సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలతో ప్రకృతిని పాడు చేయొద్దని కోరారు. ఈ సందర్భంగా చెత్త డబ్బాల ద్వారా చెత్తను సేకరించారు. పర్యాటకులకు ట్రాష్ బ్యాగులు అందజేసి అందులో వేయాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ చిన్నారెడ్డి, సొసైటీ కార్యదర్శి సంతోష్ కుమార్, హీతెన్ భీమాని, స్కూల్ ప్రిన్సిపాల్ ఆంతోని, విద్యార్థులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ప్రగతి హైస్కూల్ 1996-97 పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

కామారెడ్డి టౌన్/ భిక్కనూరు: జిల్లా కేంద్రంలోని ప్రగతి హైస్కూల్‌లో పదో తరగతి చదివిన 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే గర్గుల్ ఉన్నత పాఠశాల 1980–81 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. చిన్ననాటి స్నేహితులు ఒకేచోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91 పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.



గర్గుల్ 1980-81 పూర్వ విద్యార్థులు



పెద్దమల్లారెడ్డిలో 1990-91 పూర్వ విద్యార్థులు